జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 11 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

ఎల్ నినో కరువును ఎదుర్కొనేందుకు పశుసంపద సంరక్షణకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ

- పశుగ్రాస సాగుకు రైతులకు వందశాతం ప్రభుత్వ ఆర్థిక సహాయం



కొత్తగూడెం కలెక్టరేట్,నవంబర్ 10, (ప్రజాజ్యోతి) కొత్తగూడెం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ, కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ పశుసంపద సంరక్షణకు జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. కరువు పరిస్థితుల్లో పశువులకు పచ్చిమేత, తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు పశు పోషణపై ఆధారపడిన రైతులకు ఆర్థిక భారం తగ్గించేలా ప్రభుత్వం అందిస్తున్న వివిజిరామ్‌జి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అంకిత్ రైతులను కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపదను కాపాడటం ద్వారా రైతుల జీవనోపాధికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు . ఈ పథకం కింద ఇంటెన్సివ్

మిగతా 2 లో...

ఎన్‌హెచ్‌ఎం ఉద్యమానికి.. పెరుగుతున్న మద్దతు!



- జిల్లాలో13వ రోజుకు చేరుకున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన దీక్ష
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని, జనసేన, టీఆర్ఎస్(డి) నేతల మద్దతు
- రాష్ట్రంలో 17,541 మంది, భద్రాద్రి జిల్లాలో 670 మంది సిబ్బంది ఆందోళన
- డిమాండ్లపై స్పష్టత లేక హైదరాబాద్ చర్చల్లో రాష్ట్ర నాయక త్వానికి ఎదురుదెబ్బ
- ఉద్యోగాల క్రమబద్ధీకరణ, న్యాయమైన డిమాండ్లు తీర్చాలని విజ్ఞప్తి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, ప్రజాజ్యోతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్యమిషన్) ఉద్యోగులు చేపట్టిన ఆందోళన 13వ రోజుకు చేరుకుంది. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ వంటి న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యోగులు అలుపెరగక చేస్తున్న దీక్షకు పలు రాజకీయ పార్టీల

మిగతా 2 లో...

- సర్కార్ బడికి డుమ్మా కొట్టి పాలసీలలో బీజీ...
- పేరు సర్కార్ ఉద్యోగం.. చేసేది పాలసీ ఏజెంట్ అవతారం..! నెలకు లక్షల్లో సంపాదన.?
- మెడికల్ లీవులు పెట్టి పలు కంపెనీల మీటింగ్లలో హాజరు..!
- మస్టర్ కి ముడుపులు.. మండల అధికారులపై మామూళ్ల ఆరోపణ..!
- జిల్లా అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయా..? అందుకే ఆ ఉపాధ్యాయులపై చర్యల్లేవా..?
- బడి మానేసిన టీచర్లపై విజిలెన్స్ విచారణ జరిపి కుటుంబ సభ్యుల అకౌంట్స్ ను ట్యాలీ చేయండి...
- విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్...



విద్యార్థులు ప్రెసెంట్..! ఉపాధ్యాయులు అప్సెంట్..!

భద్రాద్రి - ఖమ్మం జిల్లాల సర్కార్ బడులలో పాఠం చెప్పాల్సిన కొందరు టీచర్లు బడికి డుమ్మా కొట్టి టాటా ఏఐ, ఎస్బీఐ తదితర పాలసీల వ్యాపారంలో బిజీ అయ్యారనే ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో సంచలనం రేపుతున్నాయి. మెడికల్ లీవ్ పేరుతో బడికి ఎగనామం పెట్టి, కంపెనీ మీటింగ్ లకు హాజరవుతూ నెలకు లక్షల్లో సంపాదిస్తున్నారనే విమర్శలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. పాలసీ డబ్బులను కుటుంబ సభ్యుల అకౌంట్లలో వేస్తున్నారని, మస్టర్ కోసం మండల అధికారులు, జిల్లా అధికారులకు ముడుపులు ముడుతున్నాయనే..? ఆరోపణలు ఇప్పుడు జిల్లాలలో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో తోటి టీచర్లే వాపోతుండగా, విద్యార్థి సంఘాలు మాత్రం విజిలెన్స్ విచారణ, సస్పెన్షన్ కోసం డిమాండ్ చేస్తున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఓసీ విస్తరణ భూ నిర్వాసితులకు భారీ ఊరట

- రూ.8.19 కోట్లు మంజూరు...
- 149 మందికి ఒక్కొక్కరికి రూ.5.50 లక్షలు...
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి కమిటీ ఆమోదం...
- 71 కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు.. కలెక్టర్ అంకిత్...
- పారదర్శకంగా పరిహారం.. వివాదాలకు తావు లేకుండా చూడండి...
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ప్రయోజనాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే పాయం విజ్ఞప్తి...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, నవంబర్ 10, (ప్రజాజ్యోతి) : మణుగూరు ఓపెన్ కాస్ట్ విస్తరణ ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు జిల్లా స్థాయి ఆర్‌అండ్ ఆర్ కమిటీ గుడ్ న్యూస్ చెప్పింది. మణుగూరు గ్రామానికి చెందిన 71 కుటుంబాలకు సంబంధించిన 149 మంది లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి

మిగతా 2 లో...

తెలంగాణను తక్షణమే కరవు ప్రాంతంగా ప్రకటించాలి!

- కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి బృందాలతో గ్రామాల్లో శాస్త్రీయ సర్వే చేయాలి
- కేవలం 364 మండలాలకే పరిమితం చేయడం అశాస్త్రీయం.. 256 మండలాలు సుభిక్షంగా ఉన్నాయా?
- పంట వేయని రైతులతో పాటు కౌలు రైతులకూ నష్టపరిహారం చెల్లించాలి
- భద్రాద్రి జిల్లా మొత్తాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించాలి: ఎస్ కే సాబీర్ పాషా
- సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి.. హోరెత్తిన కలెక్టరేట్ ధర్నా



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 10, ప్రజా జ్యోతి : తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని తక్షణమే కరవు ప్రాంతంగా ప్రకటించి, అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘాటుగా డిమాండ్ చేశారు. కరవు తీవ్రతపై సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం

మిగతా 2 లో...

ఓసీ విస్తరణ భూ నిర్వాసితులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి...)

రూ.5.50 లక్షల చొప్పున మొత్తం రూ.8,19,50,000 ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి కమిటీ నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి పునరావాసం, పున రుద్ధరణ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో రాహుల్ ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రాజెక్టు కారణంగా ప్రభావితమ వుతున్న కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. భూ సేకరణ, పరిహారం, పునరావాసం అంశాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ ప్రాజెక్టు వల్ల ప్రభావితమవుతున్న కుటుంబాలకు నిబంధనల ప్రకారం న్యాయం జరగాలని, అర్హులైన లబ్ధిదారులకు ప్యాకేజీ ప్రయోజనాలు సకా లంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సింగరేణి మణుగూరు జనరల్ మేనే జర్, భూ సేకరణ అధికారి, మణుగూరు తహసీల్దార్, సంబంధిత శాఖల అధి కారులు పాల్గొన్నారు.

ఎల్ నినో కరువును ఎదుర్కొనేందుకు పశుసంపద సంరక్షణకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ



(మొదటి పేజీ తరువాయి...)

ఫోదర్ డెవలప్‌మెంట్ ద్వారా రైతుల వ్యక్తిగత వ్యవసాయ భూముల్లో, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. వ్యక్తిగతంగా పశుగ్రాసం సాగు చేసుకోవాలనుకునే రైతులకు ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉండాలని, సాగు భూమికి బోరు, కాలువ, చెరువు లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సౌకర్యం అందుబా టులో ఉండాలని, పశుగ్రాసం సాగు చేయడానికి ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు.పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి, కూలీ ఖర్చులతో సహా మొత్తం వ్యయాన్ని ప్రభుత్వం భరి స్తుందని తెలిపారు. ఒక ఎకరంలో పశుగ్రాసం సాగు చేసేందుకు రూ.18,882 అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ పథకం కింద ఎర్రచెంగల్, నక్కతోక గడ్డి, నీడ గడ్డి, ఉప్పు గడ్డి, ఈటె గడ్డి వంటి పశు గ్రాస పంటలను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు తమ భూముల్లోనే పచ్చిమేతను అందుబాటులో ఉంచుకోవడం ద్వారా బయట నుంచి మేత కొను గోలు చేసే ఖర్చు తగ్గడంతో పాటు పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగు పడి పశుపోషణ ద్వారా ఆదాయం పెరుగుతుందని వివరించారు.అదేవిధంగా ఎల్ నినో కరువు పరిస్థితుల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామీణ ప్రాంతాల్లో వి బి జి రామ్ జి పథకం కింద నీటి తొట్ల నిర్మాణానికి అవ కాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పశువులు నీరు తాగేందుకు 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.6 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.34,707 అంచనా వ్యయాన్ని నిర్ణయించినట్లు తెలిపారు.అలాగే గొర్రెలు, మేకలకు నీటి సౌకర్యం కల్పించేందుకు 10 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.3 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.43,000 అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుత వర్షాభావ పరి స్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపదకు అవసరమైన పచ్చిమేత, తాగు నీటి సౌకర్యాలను ముందుగానే కల్పించుకోవడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస సాగుకు అనువైన భూములను, నీటి తొట్ల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించి ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచిం చారు.రైతులు,పశుపోషకులు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకొని పశు సంపదను సంరక్షించుకోవాలని కోరారు.ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తుల సమర్పణ కోసం సంబంధిత మండల పరిషత్ కార్యాల యాలు లేదా గ్రామపంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలని జిల్లా కలె క్టర్ అంకిత్ సూచించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యమానికి.. పెరుగుతున్న మద్దతు!



(మొదటి పేజీ తరువాయి...)

నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతుగా నిలుస్తున్నారు. ఏళ్ల తరబడి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నసిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

శిబిరాన్ని సందర్శించిన పలువురు నేతలు

కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించారు. సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నవంబర్ 1న జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ గదల శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణ దీక్షా శిబిరానికి వచ్చి మాట్లా డారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆ తర్వాత నవంబర్ 2న పాల్వంచలో టీఆర్ఎస్(డి)రాష్ట్రఅధ్యక్షుడునారాల సత్యనారాయణ,ఏఎండీ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. వీళ్లతో పాటు మరికొన్నిప్రజాసంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

హైదరాబాద్‌కు జిల్లా ప్రతినిధులు.. దీక్ష యథాతథం!

రాష్ట్రవ్యాప్తంగా 17,541 మంది, భద్రాద్రి జిల్లాలో 670 మందికి పైగా ఎన్‌హెచ్ఎం సిబ్బంది 78 కేడర్లలో పనిచేస్తున్నారు. గర్భిణులు, బాలింత ల సంరక్షణ, చిన్నారులకు టీకాలు వేయడం, వ్యాధుల నివారణ వంటి పనుల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ ప్రతి ఏటా తమ ఒప్పందాన్ని రెన్యూవల్ చేసుకోవాల్సి రావడం, శాశ్వత ఉద్యోగ భద్రత లేక పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసి నట్లే ఇక్కడ కూడా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

అయితే రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 13 నుంచి, భద్రాద్రి జిల్లాలో అక్టోబర్ 27 నుంచి ఈ నిరసనలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. అన్ని జిల్లాలలో దీక్షలు సాగుతుండగా,వీళ్ళ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయా జిల్లాల నుంచి కొందరు ఉద్యోగ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌కు వెళ్లారు.అక్కడ వినతులు ఇచ్చే ప్రక్రియ సాగుతున్నప్పటికీ, అన్ని చోట్ల దీక్షా శిబిరం మాత్రం యథాతథంగా కొనసాగుతుందని ఉద్యోగులు స్పష్టం చేశారు.

రాష్ట్ర నాయకత్వ అవగాహనా లేమితో ప్రతిష్టంభన..?

ఉద్యోగులు దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే దారి తప్పుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ డిమాండ్లపైకనీస అవగాహనకూడా లేకుండా రాష్ట్ర నాయకులు హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా నుంచి సోమవారం హైదరాబాద్ వెళ్లిన ప్రతినిధులు మంగళవారం ఇతర ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు,సంభందిత అధికారులను కలిసిన సందర్భంలో ఈ గుట్టు రట్టయింది. తమ డిమాండ్లలలో ఆర్థిక భారంతో కూడుకున్నవి ఎన్ని?, పరిపాలనాపరమై నవి వాటిలో ఉన్న న్యాయ పరమైన చిక్కులు ఏమిటి? అత్యవసర సర్వీసుల పరిధిలోనివావిరాలపై రాష్ట్ర నాయకత్వానికి స్పష్టత లేకపోవడాన్ని ఇతర సంఘాల నేతలు నేరుగా ఎత్తిచూపారు. ఎలాంటి ముందస్తు కార్యాచరణ, హోమ్‌వర్క్ చేయకుండానే సమ్మెకు పిలుపునిచ్చారని,అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారని సమాచారం. దీంతో రాష్ట్ర నాయకుల ఈ అవగాహనా లేమితనం వల్లే ఇతర సంఘాలు చురకలంటించే పరిస్థితి వచ్చిందని కొందరు జిల్లా ప్రతినిధులు నిరుత్సాహ పడినట్టు తెలుస్తోంది. ఈ నేతల తీరుతో జిల్లా స్థాయిలో ఎన్నో రోజులుగా వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఉద్యోగులు చేసిన సుదీర్ఘ పోరాటం నీరుగారిపోయేలా ఉందంటూ ఆవేదన వ్యక్తమవుతోంది. ఇక చివరిగా ఈ అంశం పై ఏదో ఆకాశ రామన్న లాగా వచ్చిన ఓ ప్రెస్ నోట్ నైనలిఖిత పూర్వకంగా ఇస్తే సరిపోతుందని..నేడు సంభందిత శాఖ కమిషనర్ తో జరిగే చర్చల్లో అభ్యర్థించాలని ఆయా జిల్లాల నుండి వెళ్ళిన ప్రతినిధులు ఓ అవగాహనకు వచ్చినట్టు సమాచారం .

తెలంగాణను తక్షణమే కరవు ప్రాంతంగా ప్రకటించాలి!



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ.. దేశంలోనూ, ప్రపంచంలోనూ కరవు విలయతాండవం చేస్తోందని, రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రానున్న వేసవిలో వర్షాలు లేక కరవు ప్రభావం వచ్చే అక్టోబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరవు తీవ్రతను సమగ్ర విపత్తుగా పరిగణించి ముఖ్య మంత్రి తక్షణమే స్పందించాలని కోరారు.

ఊహాజనిత అంచనాలు వద్దు..

కరవు నష్టాన్ని అంచనా వేసే విషయంలో ప్రభుత్వాల తీరును కూనంనేని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించినట్లే జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని, నియోజక వర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రైతాంగ సమస్యలను సమగ్రంగా గుర్తించాలని స్పష్టం చేశారు. ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరవు సహాయక, అంచనా బృందాలను గ్రామాల్లో పర్యటనకు పంపించకపోవడం విచారకరమన్నారు. గ్రామాల స్థాయికి వెళ్లి పరిశీలించకుండా ఊహాజనితంగా నష్టాన్ని అంచనా వేసి నిధులు డిమాండ్ చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి రూ. 25,000 కోట్లు అడగడం అశాస్త్రీయమని, క్షేత్ర స్థాయిలో నష్టం అంతకంటే ఎక్కువ గానే ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి బృందాలు అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి శాస్త్రీయంగా నష్టాన్ని లెక్కించాలని డిమాండ్ చేశారు.

364 మండలాలకే పరిమితం చేయడం సరికాదు..

రాష్ట్రంలో కేవలం 364 మండలాలనే కరవు ప్రాంతాలుగా గుర్తించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగిలిన 256 మండలాలు సుభిక్షంగా ఉన్నాయా అని ప్రభుత్వాన్నిప్రశ్నించారు.కరవు అనేది ఒక చోట మొదలైతే ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తుందని, కాబట్టి తెలంగాణ మొత్తాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం తక్షణమే స్పందించి, తగిన అంచనాల ఆధారంగా సహాయక నిధులను విడుదల చేయాలని స్పష్టం చేశారు. కరవు తీవ్రత వల్ల అసలు పంటలే వేయలేకపోయిన రైతులకు, అలాగే సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు కూడా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని,లేకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలి గంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్న లక్ష్మి కుమారి, ఎస్ డి సలీం, జిల్లా కార్యవర్గసభ్యులు చంద్రగిరిశ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, పీ పూర్ణచందర్రావు, వానిరెడ్డి మురళి, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, దేవ రకొండ శంకర్, ఎస్ కే ఫహీం తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలి – ఎస్ కే సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తాన్ని తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వం కేవలం 16 మండలాలనే గుర్తించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. వర్షాభావంతో తీవ్రంగా అల్లాడుతున్న టేకులపల్లి, పాల్వంచ, భద్రాచలం, జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు మండలాలను కూడా వెంటనే కరువు జాబితాలో చేర్చాలని కోరారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు తక్షణమే నష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉపాధి హామీ పని దినాలను పెంచాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆట 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



చర్ల, నవంబర్ 10(ప్రజా జ్యోతి):ఆదివాసీ సమాజ సమగ్ర అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అని రాష్ట్ర కార్యదర్శి బెండబోయిన సత్యనారాయణ అన్నారు. చర్ల మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఆట 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్యామల రామారావు ఆధ్వర్యంలో, జిల్లా నాయకుడు తోకల లక్ష్మీపతి సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో బెండబోయిన సత్యనారాయణ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా నాయకుడు తోకల లక్ష్మీ పతి మాట్లాడుతూ ప్రతి ఆదివాసీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, నాయకత్వ లక్షణాలను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆదివాసీ ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితం కాకుండా తమ జాతి భవిష్యత్తును నిర్మించే మార్గదర్శకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకోసం ఆట నిరంతరం పోరాడాలని సూచించారు. సభ్యత్వ నమోదు, జనరల్ ఫండ్ ద్వారా ప్రతి ఒక్కరూ సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు.వ్యక్తుల కంటే సంఘం గొప్పదని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే జాతి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.రాష్ట్ర కార్యదర్శి బెండబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆట నిరంతరం కృషి చేస్తోందన్నారు. జీఓ ఏం ఎస్ నెంబర్ .3 స్థానంలో ప్రత్యేక చట్టాన్ని సాధించడమే సంఘం భవిష్యత్తు లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సవలం వీరస్వామి మాట్లాడుతూ సంఘటిత శక్తితోనే హక్కులను సాధించగలమని, ఆట ను క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు శ్యామల రామారావు ఉపాధ్యాయుల ఐక్యతే సంఘానికి బలమని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సోయం శేషు ఆట ఆశయాలను ప్రతి ఉపాధ్యాయుడికి చేరవేసి సంఘాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు దేశ ధనలక్ష్మి, మీడియం రాజ్ కుమార్, సోయం శ్యాం కుమార్, కారం సురేష్, పరిష్క రాజు, పరిష్క అరుణ, పాయల బుచ్చిరాజు, తాటి నరసింహారావు, తునికి పాండు, ముర్రం రాజు, నవీన్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాకారుల సంఘం ఏర్పాటు



చర్ల, నవంబర్ 10:(ప్రజా జ్యోతి): చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన వాయిద్య, బ్యాండ్‌సెట్, విద్యుత్ సంగీత కళాకారుల ఐక్యత, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా సంగీత కళాకారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం చర్ల మండల కేంద్రంలోని సంతపాకలో కోకిల నాగేంద్రం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య, సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండెల చంటి హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య మాట్లాడుతూ సంగీత కళాకారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని కళాకారులు తమలోని ప్రతిభను నిరూపించుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంఘానికి ప్రభుత్వ పరంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.మచ్చ రామారావు, బండెల చంటి మాట్లాడుతూ నూతన సంఘానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సూదుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కోకిల నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా సోంపాక మంగయ్య, సహాయ కార్యదర్శిగా జంజీరాల సంతోష్, కోశాధికారిగా కొప్పుల రామకృష్ణ ఎన్నికయ్యారు. సీనియర్ కళాకారులు తోటమల్ల విజయరావు, మడిపల్లి ముత్యంలను సలహాదారులుగా నియమించారు. సభ్యులుగా సూదుల సుధాకర్, తోటమల్ల అశోక్, చినిగిరి ప్రశాంత్, ఎస్.కె. వహీద్, గుర్రం లక్ష్మణరావు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సూదుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోకిల నాగేంద్ర మాట్లాడుతూ అన్ని రంగాలకు సంఘాలు, యూనియన్లు ఉన్నట్లుగానే వాయిద్య కళాకారుల కోసం ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. సంఘాన్ని త్వరలోనే నమోదు చేయించేందుకు కృషి చేస్తామన్నారు.గతంలో స్థానికంగా బ్యాండ్‌సెట్, సంగీత కళాకారుల సంఘటిత వ్యవస్థ లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి వివాహాలు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.దీనివల్ల చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు తగ్గి నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, హక్కులను కాపాడటం, ఐక్యతను పెంపొందించడం లక్ష్యంగా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన వాయిద్య, సంగీత కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీదేవి







ఇల్లందు, నవంబర్ 10 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గోచికొండ శ్రీదేవి వరుసగా మూడవ సారి స్థానం కలిగింది. 2001, 2005 లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నాయకత్వంలో రాష్ట్ర కమిటీ లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో గోచికొండ శ్రీదేవి మూడవసారి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తనకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలో చోటు వచ్చేందుకు కృషిచేసిన మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ లకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తనకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మూడవసారి అవకాశం కల్పించిన అఖిలభారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, యూనిఫారాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

♦ భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్

భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల పోస్టుమెట్రిక్, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల ప్రక్రియను వేగవంతం చేసి, నాలుగు జతల యూనిఫారాలు పూర్తిస్థాయిలో అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు.మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏటీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 20 నాటికి స్కాలర్‌షిప్‌లు, విద్యార్థుల బ్యాంకు ఖాతాలు, పాఠశాల బిల్లులకు సంబంధించిన పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వెనుకబడిన సబ్జెక్టుల్లో అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు.వారధి పుస్తకంలోని పోటీ పరీక్షల అంశాలను ప్రతిరోజూ రెండు పీరియడ్లు బోధించాలని, పాఠశాలల్లో నాణ్యమైన డైట్, కాస్మోటిక్ సరుకులు అందించాలని ఆదేశించారు. బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఏటీడీవోలు పాఠశాలను పటిష్టంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే హెచ్ఎంలు, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డీడీ గిరిజన సంక్షేమ అధికారి చందన, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, భారతీదేవి, ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణారెడ్డి, హెచ్ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.



పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలి

• సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.జె. రమేష్ డిమాండ్



భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.జె. రమేష్ డిమాండ్ చేశారు.సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎం.బి. నర్సారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు కష్టపడి పంటలు పండిస్తున్నా గిట్టుబాటు ధర లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.రైతు సంఘం అఖిలభారత మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామికవాదులు, పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.సమావేశంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, ఎర్రంశెట్టి వెంకట రామారావు, డి. సీతాలక్ష్మి, బీబీజీ తిలక్, ఇరప అనసూయ, నాదెళ్ల లీలావతి, అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్, చొక్కా మాధవరావు, ఏ. రత్నం, కొలగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ధరల్లో వ్యత్యాసం

■ అధికారులు చర్యలు తీసుకోవాలి- కూరపాటి వీర్రాజు



చర్ల, నవంబర్ 10:(ప్రజా జ్యోతి): చర్ల మండలంలో ధాన్యం వ్యాపారుల దోపిడీతో పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంఆర్పిఎస్ మండల సీనియర్ నాయకుడు కూరపాటి వీర్రాజు ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని దళారులు ఇష్టానుసారంగా ధాన్యం ధరలు నిర్ణయిస్తూ ఉన్నారని అన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన రైతుల వద్ద 75 కిలోల పచ్చి ధాన్యం బస్తాను రూ.2,000 నుంచి రూ.2,200 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. అయితే నవంబర్ 10వ తేదీ నాటికి దళారులంతా ఒక్కటై ధరలను తగ్గించి అదే ధాన్యం బస్తాను రూ.1,800 నుంచి రూ.1,900 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని కేవలం రెండు రోజుల్లోనే బస్తాకు రూ.100 నుంచి రూ.400 వరకు ధర తగ్గడం దళారుల దోపిడీకి నిదర్శనమని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం బాధాకరమన్నారు. రైతుల సమస్యలను పట్టించుకునే నాయకులు, వారి కష్టాలను అర్థం చేసుకునే పాలకులు కరువయ్యారని విమర్శించారు.సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలు, దళారుల దోపిడీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు న్యాయం జరిగేలా ధాన్యం కొనుగోలు వ్యవస్థపై సరైన నిర్ణయం తీసుకుని గిట్టుబాటు ధర కల్పించాలని కూరపాటి వీర్రాజు కోరారు.

మైనారిటీ సంక్షేమ దినోత్సవం పట్ల నిర్లక్ష్యం తగదు

- అధికారిక వేడుకలకు నోచుకోని మౌలానా ఆజాద్ జయంతి
- ప్రభుత్వానికి వినతులు చేసినా మారని తీరు
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ పాషా



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 10, (ప్రజా జ్యోతి) మైనారిటీల సంక్షేమంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ప్రకటనలకే పరిమితమవుతోందని, మైనారిటీ సంక్షేమ దినోత్సవం పేర ఏటా మెమోలు జారీ చేయడం తప్ప క్షేత్రస్థాయిలో అధికారికంగా వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండీ యాకూబ్ పాషా అన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించాలని సోమవారం రాష్ట్ర మైనారిటీ శాఖ కార్యదర్శి తాజాగా మెమో జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఏటా మెమోలు జారీ చేస్తూ చేతులు దులుపుకోవడం కాకుండా, అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా వేడుకలు నిర్వహించేలా శాశ్వత ఉత్తర్వులు జారీ చేయాలని, గత నెలలో ప్రభుత్వానికి లేఖలు రాయడంతోపాటు సీఎం ప్రజావాణిలోనూ వినతిపత్రం అందించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయగా, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఆ స్ఫూర్తిని కొనసాగించడం లేదని యాకుబ్ పాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. మైనారిటీల పట్ల చిన్నచూపు వీడి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని అన్ని విద్యా సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారికంగా నిర్వహించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తులకు ఘన సన్మానం

- భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం



భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): భద్రాచలం ప్రాంతానికి చెందిన న్యాయవాద వృత్తిలో రాణించి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో న్యాయమూర్తులుగా ఉన్నత పదవులు చేపట్టిన మండా వెంకటేశ్వరరావు, దేవరపల్లి నాగేశ్వరరావులను భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్ మాట్లాడుతూ, భద్రాచలం ప్రాంతం నుంచి న్యాయవ్యవస్థలో ఉన్నత స్థానాలకు ఎదిగి సేవలందిస్తున్న న్యాయమూర్తులను సత్కరించుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్, జస్టిస్ ముమ్మనేని సుధీర్ కుమార్ సేవలను కూడా కొనియాడారు.హైకోర్టు న్యాయవాది పి.వి. కృష్ణమాచారి మాట్లాడుతూ, న్యాయవాద వృత్తి విలువలను కాపాడుతూ ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయమూర్తుల సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీతలు మండా వెంకటేశ్వరరావు, దేవరపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, భద్రాచలంలో న్యాయవాద వృత్తికి శ్రీకారం చుట్టిన తమను సొంత ప్రాంతంలో సత్కరించడం ఆనందంగా ఉందని, బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సీనియర్ న్యాయవాదులు ఎస్.కె. అక్తర్, పసుపులేటి రాంబాబు, ముత్యాల రామచంద్రయ్య, కిషోర్, కే. అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మారిన... పేర్లు మార్చారా?

- నిర్లక్ష్యమా.. లేక మర్చిపోయారా?
- ప్రజలకు సమాచారం కోసం ఏర్పాటు చేసిన బోర్డులో పాత అధికారుల పేర్లు
- కమిషనర్, మేనేజర్, డీఈ పేర్లు మార్చకపోవడంపై విమర్శలు
- వెంటనే బోర్డును సరిచేయాలని ప్రజల డిమాండ్

ఇల్లందు, నవంబర్ 10 (ప్రజా జ్యోతి) ప్రజలకు సమాచారం అందించాలనే ఉద్దేశంతో ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డులో అధికారుల పేర్లు మాత్రం పాతవే దర్శనమిస్తున్నాయి. అధికారులు మారినా.. బోర్డుపై పేర్లు మార్చే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా? లేక పేర్లను మార్చడం మర్చిపోయారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ప్రజలకువివిధ అంశాలపై సమాచారం అందించేందుకు ఏర్పాటు చేసిన బోర్డులో ప్రస్తుతం విధుల్లో లేని పాత కమిషనర్, మేనేజర్, డీఈ పేర్లు కొనసాగుతుండడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల బదిలీలు, బాధ్యతల మార్పులు జరిగినప్పటికీ బోర్డుపై పాత పేర్లే ఉండటం వల్ల ప్రజలకు సరైన సమాచారం అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

›› సమాచారం కోసం ఏర్పాటు చేసిన బోర్డులో పాత పేర్లే!

ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సమాచార బోర్డులు పారదర్శకతకు ప్రతీకగా నిలవాలి.అయితేసంబంధిత అధికారులు మారినప్పటికీ బోర్డుపై పేరును సవరించకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తుంది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారుల పేర్లను నమోదు చేయాల్సిన బాధ్యత సంబంధితవిభాగంపైఉన్నప్పటికీ, ఈ విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



›› నిర్లక్ష్యమా.. మర్చిపోయారా?

ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో అధికారుల పేర్లను మార్చడం పెద్ద పనే మీ కాకపోయినా, ఇలాంటి చిన్న విషయాల్లోనూ నిర్లక్ష్యం కనిపిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బోర్డుపై పాత పేర్లు కొనసాగడం వల్ల ప్రజలు సంబంధిత అధికారుల వివరాలు తెలుసుకోవడంలో గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజలకు సరైన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, బోర్డుపై పాత పేర్లను తొలగించి ప్రస్తుతం విధుల్లో ఉన్న కమిషనర్, మేనేజర్, డీఈ పేర్లను నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై స్పందించి వెంటనే బోర్డును సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రామాలయానికి రూ.1.14 లక్షల విలువైన రబ్బరు కార్పెట్ల వితరణ

- హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, హరిత దంపతుల పిల్లల సహకారం



భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి హైదరాబాద్ లోని ఓయాసిస్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, హరిత దంపతులు తమ పిల్లలు విశ్రుత్, యషిత, స్నేహితుల సహకారం తో రూ.1.14 లక్షల విలువైన రబ్బరు కార్పెట్లను మంగళవారం వితరణ చేశారు. నిత్య కల్యాణ మండపంలో ఈ కార్పెట్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఈ కార్పెట్ల పై కూర్చుని స్వామివారి నిత్య కళ్యాణాన్ని మరింత సౌకర్యవంతంగా వీక్షించవచ్చని ఈవో దామోదర్ రావు తెలిపారు.గతంలోనూ ఈ వైద్య దంపతులు దేవస్థానానికి కలర్ ప్రింటర్ తో పాటు రూ.40 వేల విలువైన కార్పెట్లను అందజేశారు. ఈ సేవా కార్యక్రమానికి సాయిబాబా ఆలయ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సమాజసేవకుడు కదాలి నాగరాజు సహకరించారు. ఏఈవో శ్రావణ్ కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొని దాతల సేవలను అభినందించారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

చర్ల, నవంబర్ 10(ప్రజా జ్యోతి):నవంబర్ 26న భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల కేంద్రంలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మల్లారం గ్రామంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.బీఎస్పీ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు చెన్నం మోహన్, చర్ల మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి కేసుపాక కృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వీసంపల్లి నరసింహారావు హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని చర్ల మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ జోనల్ ఇన్ చార్జి దాగిళ్ల దయానంద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమానికి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమిష్టిగా విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు ధ్రువ నరసింహారావు, కాకా నరసయ్య, సోయం శ్రీమూర్తులు, దుమ్ముగూడెం మండల సీనియర్ నాయకులు కంచర్ల సింహాద్రి, తాటి మోతురి, ఇరప ధర్మరాజు, పాయల ప్రమీల, శంకర్, బోసు తదితర బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.


విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి



బూర్గంపహాడ్,నవంబర్10(ప్రజా జ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థుల హాజరు పట్టికలు, బోధనా డైరీలు,మార్కుల రిజిస్టర్లు,ప్రవేశ రికార్డులను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు.ఎంఎల్టీ,సీటీ కోర్సుల ఓజేటీ శిక్షణ తీరును పరిశీలించారు.రానున్న పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు.చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి,ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని అధ్యాపకులకు సూచించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.చిన్నా,అధ్యాపకులు సీహెచ్.నాగేశ్వరరావు,ఎన్.ఎస్.కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.



- సర్కార్ బడికి డుమ్మా కొట్టి పాలసీలలో బీజీ...
- పేరు సర్కార్ ఉద్యోగం.. చేసేది పాలసీ ఏజెంట్ అవతారం..! నెలకు లక్షల్లో సంపాదన.?
- మెడికల్ లీవులు పెట్టి పలు కంపెనీల మీటింగ్లలో హాజరు..!
- మస్టర్ కి ముడుపులు.. మండల అధికారులపై మామూళ్ల ఆరోపణ..!
- జిల్లా అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయా..? అందుకే ఆ ఉపాధ్యాయులపై చర్యల్లేవా..?
- బడి మానేసిన టీచర్లపై విజిలెన్స్ విచారణ జరిపి కుటుంబ సభ్యుల అకౌంట్స్ ను ట్యాలీ చేయండి...
- విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్...



విద్యార్థులు ప్రెసెంట్..! ఉపాధ్యాయులు అప్సెంట్..!

భద్రాద్రి - ఖమ్మం జిల్లాల సర్కార్ బడులలో పాఠం చెప్పాల్సిన కొందరు టీచర్లు బడికి డుమ్మా కొట్టి టాటా ఏఐ, ఎస్బీఐ తదితర పాలసీల వ్యాపారంలో బిజీ అయ్యారనే ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో సంచలనం రేపుతున్నాయి. మెడికల్ లీవ్ పేరుతో బడికి ఎగనామం పెట్టి, కంపెనీ మీటింగ్ లకు హాజరవుతూ నెలకు లక్షల్లో సంపాదిస్తున్నారనే విమర్శలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. పాలసీ డబ్బులను కుటుంబ సభ్యుల అకౌంట్లలో వేస్తున్నారని, మస్టర్ కోసం మండల అధికారులు, జిల్లా అధికారులకు ముడుపులు ముడుతున్నాయనే..? ఆరోపణలు ఇప్పుడు జిల్లాలలో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో తోటి టీచర్లే వాపోతుండగా, విద్యార్థి సంఘాలు మాత్రం విజిలెన్స్ విచారణ, సస్పెన్షన్ కోసం డిమాండ్ చేస్తున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, ప్రజాజ్యోతి

ప్రభుత్వ బడులలలో విద్యార్థుల శాతం పెంచాలని ఒక పక్క ప్రభుత్వం మొత్తుకుంటుంటే ఉపాధ్యాయులు మాత్రం ప్రభుత్వ బడులకు వెళ్లకుండా పాలసీల వెంట తిరగడం సంచలనం రేపుతున్నాయి. దీంతో "జీతం సర్కారుది..ఉద్యోగం ప్రవేట్ కంపిణీ పాలసీలదని" స్పష్టంగా తెలుస్తోంది. ఉదయం బడి గంట మోగే సమయానికి ఆ టీచర్లు పాలసీ కస్టమర్ల ఇంటి ముందు ఉంటున్నారని, సాయంత్రం వరకు పాలసీ పేపర్లతోనే తిరుగుతున్నారని స్థానికులు చెప్పడం సంచలనం రేపుతున్నాయి. బడిలో వీరిపీరియడ్ ఖాళీగా ఉంటుండగా, పిల్లలు మాత్రం గంటల తరబడి టీచర్ కోసం ఎదురుచూస్తున్నారని తోటి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు వాపోతున్నారు. వీరి లీవ్ లేటర్లు ఎప్పుడు ఆమోదం అవుతున్నాయో, మస్టర్ లో సంతకాలు ఎలా పడుతున్నాయో అర్థం కావడం లేదని తోటి ఉపాధ్యాయుల ప్రశ్న చర్చనీయాంశంగా మారింది.

సర్కారు బడులను వదిలేసినా ఉపాధ్యాయులు

సర్కార్ బడులను వదిలేసిన కొందరు ఉపాధ్యాయుల వ్యవహారం ఇప్పుడు రెండు జిల్లాల్లో పెద్ద చర్చగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో వీరు బడిలో కనిపించడం లేదని, పాలసీ పనుల్లోనే తిరుగుతున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఉదయం బడి తెరిచే సమయానికి వీరు వేరే చోట పాలసీ మీటింగ్లలో ఉంటున్నారని, సాయంత్రం వరకు కస్టమర్ల వెంటే తిరుగుతున్నారని తోటి ఉపాధ్యాయుల దెగ్గర నుంచి ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇది ఒక్కరోజు సమస్య కాదు, రోజూ ఇదే తంతు నడుస్తోందని, లీవ్ ల పేరుతో బడికి ఎగనామం పెడుతున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. వీరిని ప్రశ్నించాల్సిన వ్యవస్థే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

పాలసీల కోసం పరుగులు

పాలసీల కోసం పరుగులు తీస్తున్న కొందరు ఉపాధ్యాయుల తీరు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. బడి గంట మోగగానే క్లాస్ లోకి వెళ్లాల్సిన వారు, బైక్ తీసుకొని ఊరూరా తిరుగుతూ కస్టమర్లను వెతుకుతుండటం గమనార్హం. ఒకప్పుడు పిల్లల అడ్మిషన్ కోసం తిరిగిన టీచర్లు, ఇప్పుడు పాలసీ కస్టమర్ కోసం తిరుగుతున్నారని, ఫోన్లో కూడా పాలసీ లెక్కలే మాట్లాడుతున్నారని తెలుస్తోంది. బడిలో ఉండాల్సిన టైంలో పెళ్లిళ్లు, చావులు, పండగల దగ్గర కూడా పాలసీ ఫారాలు పట్టుకొని కనిపిస్తున్నారని తోటి ఉపాధ్యాయులే వాపోతున్నారు. ప్రీమియం గడువు దగ్గర పడితే చాలు, బడి సంగతి మర్చిపోయి కస్టమర్ ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, టార్గెట్ పూర్తి చేయడం కోసం రోజంతా అదే పనిలో ఉంటున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో పిల్లల చదువు పక్కకు పోయి, పాలసీల వ్యాపారమే ఫుల్ టైం జాబ్ గా మారిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లా అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయా..? అందుకే ఆ ఉపాధ్యాయులపై చర్యల్లేవా..?

బడికి రాని ఉపాధ్యాయులపై చర్యలు లేకపోవడం వెనుక ఏదో జరుగుతోందనే అనుమానం ఇప్పుడు జిల్లాల వ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. నెలల తరబడి బడికి రాకపోయినా, ఒక్క షోకాజ్ నోటీస్ కూడా రాకపోవడం చూసి, పై స్థాయిలో ఏదో సెటిల్మెంట్ భారీగా జరిగిందనే.? చర్చ చర్చనీయంశంగా మారింది. జిల్లా విద్యాశాఖలో ఫైల్ కదలాలంటేనే ఫైల్ కదలడం లేదని, అదే ఆ ఉపాధ్యాయుల ఫైళ్లు మాత్రం వేగంగా క్లియర్ అవుతున్నాయని తోటి ఉపాధ్యాయులే ఆరోపణలు చేయడం సంచలనం సృష్టిస్తున్నాయి. పిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, విచారణ పేరుతో కాలయాపన చేయడం చూస్తుంటే ముడుపుల వ్యవహారం నిజమేనా అనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి. ఇది నిజమా కాదా అనేది తేలాలంటే కలెక్టర్ స్థాయిలో విచారణ జరగాలని, జిల్లా ఆఫీస్ లో ఆ ఉపాధ్యాయులకు సంబంధించిన లీవ్, ట్రాన్స్ ఫర్, విచారణ ఫైళ్లను బయటకు తీస్తేనే అసలు కథ తెలుస్తుందని డిమాండ్ వస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్లు స్పందించి ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రైవేట్ వ్యాపారం చేస్తూ, పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై ఇకనైనా కఠిన చర్యలు తీసుకోకపోతే సర్కార్ బడులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.



రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / నవంబర్ 10, (ప్రజా జ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం పాల్వంచలో జరిగింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ నెహ్రూ నగర్‌కు చెందిన పగిళ్ల శోభ (39) రోడ్డు ప్రమాదంలో మృతి మృతి చెందింది, మృతురాలి కుమారుడు పోలీసులకు అందించిన ఫిర్యాదు ప్రకారం ఈనెల 9 న సోమవారం సాయంత్రం సమయంలో శోభ నెహ్రూ నమర్‌లోని స్టోర్స్ షాపులో రేషన్ బియ్యం తీసుకుని, మెయిన్ రోడ్డు పక్కన దమ్మపేట సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో సాయి సుధా హాస్పిటల్ ఎదురుగా వస్తుండగా, భద్రాచలం వైపు నుండి కొత్తగూడెం వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వ్యాన్, డ్రైవర్ సన్నేనా రాము అతివేగంగా నడుపుతూ శోభను వెనుక నుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె రోడ్డు మీద పడిపోగా, లారీ ముందు టైరు ఆమె పైనుండి వెళ్లడంతో తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందారు. అక్కడున్న స్థానికులు ఆమెను వెంటనే అంబులెన్స్ ద్వారా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆమె చనిపోయినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ సన్నేనా రాము చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు పగిళ్ల మనోజ్ పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ యేసయ్య నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్



ములకలపల్లి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఇంటిక లక్ష్మి అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం చండ్ర పుల్లారెడ్డి నాయకత్వంలో సాగిన పోరాటాలు పేదలకు లక్షలాది ఎకరాల భూమిని అందించాయని గుర్తుచేశారు. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం వందలాది మంది విప్లవకారులు ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తూ, వారి భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాల సాధనకు పోరాడటమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చంటి, వెంకన్న, సీతారాములు, రామకృష్ణ, పుల్లారావు, భద్రయ్య, సీతయ్య, లలిత, లక్ష్మి, నాగమణి, రాములమ్మ, సరోజిని, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై వాహనాల రాకపోకలు పునరుద్ధరణ

- **ఎమ్మెల్యే జారె, బత్తుల అంజికి సర్పంచ్ కృతజ్ఞతలు**



ములకలపల్లి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): మురసు తుఫాను వర్షాలకు తెగిపోయిన మూకమామిడి–మొగరలగుప్ప మధ్య వంతెనపై మంగళవారం వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాత్కాలిక డైవర్షన్ పనులు కొనసాగుతుండగానే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు రాకపోకలకు మార్గం పునరుద్ధరించారు. వంతెన తెగిపోవడంతో గత కొన్ని రోజులుగా గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి చొరవతో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె, బత్తుల అంజికి మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో శాశ్వత వంతెన నిర్మాణం కూడా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

అన్వేష్ రెడ్డిని పరామర్శించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు



భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): భద్రాచలానికి చెందిన ఆర్-టీవీ రిపోర్టర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) సభ్యుడు అన్వేష్ రెడ్డికి ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడంతో మంగళవారం యూనియన్ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు బీవీ రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజ్జిగిరి రాజా కిరణ్, సీనియర్ నాయకులు బి. దిలీప్, పీవీ బాబు అన్వేష్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని తిరిగి జర్నలిజం రంగంలో చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అఖిలపక్ష సమావేశం



చర్ల, నవంబర్ 10: (ప్రజా జ్యోతి): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్ల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఓటర్ల జాబితా పరిశీలన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలపై వివరించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుసరించాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.రెవెన్యూ సిబ్బంది, స్థానిక పోలీసు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

12న విద్యుత్ వినియోగదారుల సదస్సు

ములకలపల్లి నవంబర్ 10 (ప్రజాజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న ములకలపల్లిలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు స్థానిక విద్యుత్ శాఖ ఏఈ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ కె.మాధవరావు,సభ్యులు ఈ సదస్సుకు హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, వోల్టేజీ హెచ్చుతగ్గులు,విద్యుత్ లైన్లసమస్యలు,లోఫ్లయింగ్ మీటర్ల మార్పిడి,నూతన విద్యుత్ సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసుల పేరు మార్పు, కేటగిరీ మార్పు తదితర సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను నేరుగా సదస్సులో అందజేయవచ్చని వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

సర్వే సక్రమంగా చేయండి..!

- గడువులోగా సర్వేను పూర్తి చేయాలి
- పాఠశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- చినరావిగూడెంలో సబ్ కలెక్టర్ పర్యటన.. రీసర్వే పనుల పరిశీలన...!
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 10, (ప్రజాజ్యోతి): -

భూ రీసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా సర్వే పనులు పూర్తి చేయాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. మంగళవారం మణుగూరు మండలం చినరావిగూడెం గ్రామంలో జరుగుతున్న పునసర్వే పనులను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలోని ఎంజాయ్ మెంట్ సర్వే పునఃపరిశీలన పనుల పురోగతిని పరిశీలించారు. భూముల వివరాలు, సరిహద్దులు, సర్వే మ్యాప్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని సర్వేయర్ బృందానికి సూచించారు. ఖచ్చితమైన, సరైన భూ రికార్డుల నిర్వహణను నిర్ధారిస్తూ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చినరావిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బోధన విధానం, విద్యార్థుల అభ్యాసన స్థాయి, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులందరూ ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం తరగతి గదులు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే ప్రదేశం, తాగునీటి సౌకర్యాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలు,మరమ్మత్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భోజనం నాణ్యతను పరిశీలించేందుకు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మహాసభలను జయప్రదం చేయండి

♦ సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు



చర్ల, నవంబర్ 10: (ప్రజా జ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడి, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం చర్ల మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు. చర్ల మండల పరిధిలోని ఆనంద్ కాలనీలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శాఖ సమావేశానికి శ్యామల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మచ్చా రామారావు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు.ఎరువులు,విత్తనాలు,పురుగుమందుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి మాట్లాడుతూ రైతాంగ హక్కుల సాధన కోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు.ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతు ఉద్యమ నాయకులు, మేధావులు, ప్రముఖులు కలిపి సుమారు 1,500 మంది ఈ మహాసభలకు హాజరుకానున్నారని తెలిపారు. రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతుల హక్కుల సాధన తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు . చర్ల మండలం నుంచి రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఆనంద్ కాలనీకి చెందిన రైతులు, మహిళలు, రైతు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టులను కలిసిన బీజాపూర్ ఎస్పీ

■ నైపుణ్య శిక్షణ, పునరావాస కార్యక్రమాలపై ఆరా

■ నృత్య ప్రదర్శనతో బస్తర్ అభివృద్ధిని చాటిన పునరావాసితులు





చర్ల , నవంబర్ 10: (ప్రజా జ్యోతి):

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పునరావాస కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఉమేష్‌ప్రసాద్ గుప్తా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాసం పొందుతున్న మాజీ మావోయిస్టులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కొనసాగుతున్న పునరావాస, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు.నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న వారితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, శిక్షణ ద్వారా పొందుతున్న అనుభవాలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పునరావాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు,అవసరాలను అడిగి తెలుసుకున్నారు.స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని,జనజీవన స్రవంతిలో కలిసిపోయి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని వారిని ప్రోత్సహించారు. అనంతరం పునరావాసితులు ఉత్సాహంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ద్వారా బస్తర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని, మారుమూల గ్రామాలకు సైతం చేరుతున్న మౌలిక సదుపాయాలను కళ్లకు కట్టినట్లు చూపించారు.గ్రామగ్రామాన పాఠశాలలు, ఆసుపత్రులు, రేషన్ దుకాణాలు, రహదారులు, విద్యుత్, తాగునీరు, మొబైల్ నెట్‌వర్క్ వంటి సదుపాయాలు విస్తరిస్తున్న తీరును నృత్యం ద్వారా ప్రదర్శించారు.ఈ కార్యక్రమం మొత్తం ఆహ్లాదకరమైన, ఆత్మీయ వాతావరణంలో సాగింది. పునరావాసితుల్లో కనిపించిన ఉత్సాహం సానుకూల దృక్పథం వారి జీవితాల్లో వస్తున్న మార్పులకు నిదర్శనంగా నిలిచాయి.

కుటుంబ భూ వివాదంలో అన్యాయంగా కేసులు పెట్టారు

- రీ-ఎంక్వైరీ జరిపి న్యాయం చేయాలి
- విలేకరుల సమావేశంలో బల్లెం చిన్న వెంకటేశ్వర్లు కుటుంబం విజ్ఞప్తి



పాల్వంచ, నవంబర్ 10, ప్రజాజ్యోతి: కుటుంబ భూ వివాదం నేపథ్యంలో తమ కుమారుడు బల్లెం సతీష్‌పై అన్యాయంగా కేసులు నమోదు చేశారని, వాటిపై ఉన్నతాధికారులు పునర్విచారణ (రీ-ఎంక్వైరీ) జరిపి న్యాయం చేయాలని బల్లెం చిన్న వెంకటేశ్వర్లు, ఆయన భార్య చంద్రమ్మ కోరారు. సోమవారం పాల్వంచలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ కుటుంబ వివాదానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బల్లెం చిన్న వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. తమ తండ్రికి మొత్తం 10 ఎకరాల భూమితో పాటు రెండు ప్లాట్లు ఉన్నాయని, 1999లో తండ్రి ఆధ్వర్యంలో జరిగిన ఒప్పందం ప్రకారం తాను, తన అన్న బల్లెం పెద్ద వెంకటేశ్వర్లు చెరో ఐదు ఎకరాల చొప్పున భూమిని పంచుకున్నామని తెలిపారు. అనంతరం తన పొలంలోని జామాయిల్ తోటను ట్రాక్టర్‌తో దున్ని తొలగించడంతో తాను ప్రశ్నించగా, తిరిగి భూమిని పంచుకోవాలని అన్న పట్టుబట్టడంతో కుటుంబంలో వివాదాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో తన వదిన కళావతి, అన్న కుమారులు శ్రీనివాస్, శ్రీకాంత్ తనపై దాడి చేసి కొట్టారని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబంపై కక్ష పెంచుకుని తన కుమారుడు బల్లెం సతీష్‌పై ఆగస్టు 2024లో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. తన కుమారుడు కొట్టాడని, తిట్టాడని కేసు నమోదు చేశారని, అయితే కేసు నమోదైన సమయంలో తన కుమారుడు హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడని, అతని వయస్సు 17 సంవత్సరాలు మాత్రమేనని తెలిపారు. పాల్వంచలో లేని తన కుమారుడిపై తప్పుడు కేసు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో రాజీపడితేనే తన కుమారుడిపై కేసు తొలగిస్తామని బెదిరింపులు చేస్తున్నారని ఆరోపించారు. తమ కుమారుడిపై నమోదైన కేసుల వాస్తవాలను వెలికితీసేందుకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర పునర్విచారణ జరిపించాలని కోరారు. అలాగే తమ వద్దతీసుకున్న బంగారాన్ని తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తమ కుటుంబానికి న్యాయం చేయాలని బల్లెం చిన్న వెంకటేశ్వర్లు, బల్లెం చంద్రమ్మ, బల్లెం సతీష్ కోరారు.

క్రీడా పోటీల్లో చిన్నారి నక్షత్రకు స్వర్ణ పతకం

- శ్రీ చైతన్య పాఠశాలలో ఎల్కేజీ విద్యార్థిని ప్రతిభ
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల అభినందనలు



పాల్వంచ, నవంబర్ 10, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎల్కేజీ విద్యార్థిని మొల్లుగూరి నక్షత్ర అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని సాధించింది. చిన్న వయసులోనే క్రీడల్లో తన ప్రతిభను చాటుకున్న నక్షత్ర స్వర్ణ పతకంతో పాటు ప్రతిభా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల రాణి, తరగతి ఉపాధ్యాయురాలు చందన విజేత నక్షత్రకు బహుమతులను అందజేసి అభినందించారు. చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో ముఖ్యమని, చిన్ననాటి నుంచే ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెరుగుతాయని ప్రిన్సిపాల్ మిరియాల రాణి తెలిపారు. నక్షత్ర సాధించిన విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తన కుమార్తె విజయం పట్ల తండ్రి సందీప్ (విలేకరి), తల్లి ఎం. ఈశ్వరి (జెన్‌కో ఉద్యోగి) ఆనందం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో నక్షత్ర మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

డ్రెయిన్ మధ్యలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు నిలిపివేయాలి

- మున్సిపల్ అధికారులకు పానిశెట్టి వెంకటేశ్వర్లు వినతి.
- ఇప్పటికే తవ్విన గోతులను పూడ్చివేయాలని డిమాండ్



పాల్వంచ, నవంబర్ 10, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని ములకలపల్లి రోడ్డు నుంచి తెలంగాణ నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డు పక్కన ఉన్న డ్రెయిన్ మధ్యలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు గోతులు తవ్వడంపై అభ్యంతరం వ్యక్తమైంది. ఈ పనులను తక్షణమే నిలిపివేసి, డ్రెయిన్ వ్యవస్థకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ కార్యాలయంలో ఆర్.ఐ. రాంమూర్తిని కలిసి పానిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పానిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డ్రెయిన్ మధ్యలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని, భవిష్యత్తులో డ్రెయిన్ శుభ్రపరిచే పనులు, నిర్వహణ కూడా కష్టతరమవుతాయని పేర్కొన్నారు. ప్రతి వర్షాకాలంలో సమీపంలోని గుట్ట నుంచి భారీగా వరదనీరు డ్రెయిన్‌లోకి ప్రవహిస్తుందని, ఈ నేపథ్యంలో డ్రెయిన్ మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తే వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన డ్రెయిన్ వ్యవస్థకు నష్టం కలగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఇప్పటికే తవ్విన గోతులను వెంటనే పూడ్చివేయాలని, విద్యుత్ స్తంభాలను ప్రజలకు, డ్రెయిన్ వ్యవస్థకు ఇబ్బంది కలగని ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ పనులకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందారా లేదా అనే అంశంపై విచారణ జరిపి, అనుమతులు లేకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పారిశుద్ధ్యం, వర్షపు నీటి సజావైన ప్రవాహం, ప్రజాధనంతో నిర్మించిన మౌలిక సదుపాయాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొండ్ సాహెబ్, ప్రశాంత్, లక్ష్మణ్, రుద్రా, చిరంజీవి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని రోడ్డులో తాగునీటి లీకేజీలు, డ్రైనేజీ సమస్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన

- అధికారులతో కలిసి సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ జయలక్ష్మి మనోహర్ రావు



పాల్వంచ, నవంబర్ 10, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని 36వ డివిజన్ పరిధిలో కిన్నెరసాని రోడ్డులో నెలకొన్న తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్ రావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్‌తో కలిసి సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో చర్చించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టి నీటి వృథాను నివారించాలని, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే సమస్యల పరిష్కారానికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్ తెలిపారు. ఈ పర్యటనలో కార్పొరేషన్ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, వాటర్ సప్లై అధికారి బోడపాటి కిరణ్, విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ కాసిమల్ల నరసింహారావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం వెంకటరత్నం, యువజన నాయకులు పట్టా వీరకుమార్, టీడీపీ నాయకులు కత్తి శ్రీను, చండ్ర వీరయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ షఫీ, యూత్ కాంగ్రెస్ ఓబీసీ ప్రెసిడెంట్ అమీర్, శానిటరీ జవాన్ భరత్, వర్క్ ఇన్స్పెక్టర్ జాకీర్ పాషా, మధుసూదన్ రెడ్డి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ముందు చెత్తాచెదారం

- డంపింగ్ యార్డును తలపిస్తున్న వైనం.
- కార్తీక మాసంలోనూ భక్తులకు అపరిశుభ్ర పరిసరాలే స్వాగతం.
- కార్పొరేషన్ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



పాల్వంచ, నవంబర్ 10, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని 1వ డివిజన్ బొల్లోరుగూడెంలో ఉన్న శ్రీ లలితా కామేశ్వర స్వామి శివాలయం ముందు పేరుకుపోయిన చెత్తాచెదారం డంపింగ్ యార్డును తలపిస్తోంది. కార్తీక మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండగా, ఆలయం ఎదుట అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం పట్ల స్థానికులు, భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసం నవంబర్ 10 నుంచి ప్రారంభమై డిసెంబర్ 8 వరకు కొనసాగనున్న నేపథ్యంలో శివాలయాలకు భక్తుల రాక పెరుగుతోంది. ఇలాంటి పవిత్ర మాసంలో భక్తులకు ఆలయం ముందు చెత్తాచెదారం దర్శనమివ్వడం కార్పొరేషన్ పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆలయం పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే స్పందించి ఆలయం ముందు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో రెండు పోలింగ్ కేంద్రాలు

- అఖిలపక్ష తీర్మానం.. తహసీల్దార్‌కు వినతి



బూర్గంపహాడ్,నవంబర్10,(ప్రజా జ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బూర్గంపహాడ్ లో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో రెండు ఏర్పాటు చేయాలని నాయకులు తీర్మానించారు. ఈ మేరకు సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. దీనిని ఉన్నతాధికారులకు పంపించి పోలింగ్ కేంద్రాల పెంపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లుతో పాటు బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భద్రాచలం ఐటిడిఏలో ప్రారంభమైన జన్‌జాతీయ గౌరవ్ దివస్ -2026 వేడుకలు

- గిరిజన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన
- భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్



భద్రాచలం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): గిరిజన విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, పరిశోధన, ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.జన్‌జాతీయ గౌరవ్ దివస్–2026 వేడుకల్లో భాగంగా ఐటీడీఏ గిరిజన భవన్‌లో సీఎస్ఐఆర్–ఐఐసీటీ హైదరాబాద్ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీడీఏ పీఓ బి.రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, సైన్స్, సాంకేతిక రంగాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలనిపీఓ ఆకాంక్షించారు.అనంతరం జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో నిర్వహించిన పరీక్షల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

ఎర్రంపాడు, చెన్నంపాడులో వైద్య శిబిరాలు





చర్ల, నవంబర్ 10: (ప్రజా జ్యోతి): చర్లమండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎర్రంపాడు, చెన్నంపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరాలకు గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా గర్భిణులు , ప్రసవానంతర తల్లులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్తులకు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరోగ్యంపై తగిన అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఈ శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న 51 మందికి రక్త నమూనాలు సేకరించి ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. సాధారణ ఓపీ విభాగంలో 58 మందికి వైద్య సేవలు అందించారు.ఈ వైద్య శిబిరాల్లో సత్యనారాయణపురం వైద్య సిబ్బంది హెచ్ వీ తిరుపతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు టి. వేణు, టి. వరప్రసాద్, పి. సుబ్బారావు, ఆశా కార్యకర్తలు ఎం. సోమమ్మ, ఎం. దేవి పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకే పెద్దపీట..

- డిసెంబర్ నెలాఖరు లోగా రీసర్వే పూర్తి.. భూ సమస్యలకు చెక్..!
- రైతుల సమస్యలపై స్పందన..!
- అటవీ - రెవెన్యూ భూములకు స్పష్టత.. రైతులకు ఊరట..!
- రామ్ నగర్ నుంచి పాములపాడు వరకు రోడ్డు నిర్మాణం లేదు.. కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు..!
- ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు.. చివరి గ్రామం వరకు అభివృద్ధి..!
- భద్రాద్రి మణుగూరు చిన్నరాయిగూడెంలో జిల్లా కలెక్టర్ పర్యటన









భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 10, (ప్రజాజ్యోతి)

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు ప్రతి చివరి గ్రామానికి చేరాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం మణుగూరు మండలం చిన్నరాయిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, అటవీ భూముల సరిహద్దులు, భూముల విస్తీర్ణం, సర్వే పురోగతిపై సర్వేయర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

›» 1,395 ఎకరాల విస్తీర్ణంలో 554 ఎకరాలు అటవీ భూమి

చిన్నరాయిగూడెం గ్రామానికి సంబంధించి మొత్తం 1,395 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అటవీ శాఖ రికార్డుల ప్రకారం 554 ఎకరాలు అటవీ భూమిగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ పట్టా దారు పాస్ పుస్తకాలు, సర్వే నంబర్లు, రెవెన్యూ రికార్డులు,అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సాగులో ఉన్న భూములకు సంబంధించి సర్వే నంబర్లలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతుల వినతులను సావధానంగా విన్న కలెక్టర్, రీసర్వే పూర్తయిన తర్వాత భూముల సరిహద్దులు, రెవెన్యూ, అటవీ భూములపై స్పష్టత వస్తుందని తెలిపారు. వినతులను రికార్డుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

›» గ్రామ సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి

తమ గ్రామానికి సమస్యలు ఉన్నాయని గ్రామస్తులు కలెక్టర్ తెలియజేశారు. గ్రామస్తులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, మొబైల్ నెట్ వర్క్, రహదారి సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాంనగర్ నుంచి పాములపాడు వరకు రహదారి లేకపోవడంతో అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే సమయంలో పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

›» జిల్లా కలెక్టర్ ఏమన్నారంటే

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 70 కాడస్ట్రల్ గ్రామాలతో పాటు మ్యాప్ లు లేని 7 నాన్ కాడస్ట్రల్ గ్రామాల్లో రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. రెండు నెలల క్రితం ప్రారంభమైన ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని 23 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించి,మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న గ్రామాలతో పాటు మారుమూల చివరి గ్రామాలు, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినట్లు చెప్పారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం, తాగునీరు, చేయూత పింఛన్ల తది తర పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే నిర్వహించి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో స్పష్టత వచ్చి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ,సర్వేయర్లు నరేష్, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే పోలీస్ ఉద్యోగం మీదే

- ఉచిత శిక్షణతో ఉద్యోగాల బాట
- సింగరేణి - పోలీస్ సంయుక్తంగా ఉచిత కోచింగ్
- పోలీస్ అభ్యర్థులకు పోలీస్ భరోసా
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ప్రతినిధి. నవంబర్ 10, (ప్రజాజ్యోతి): – పోలీస్ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కష్టపడి చదువుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు.మంగళవారం పోలీస్ శాఖ,సింగరేణి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అభ్యర్థులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్వయం గా హాజరై ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అంటే కేవలం చదువు మాత్రమే కాదు, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన అని స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని ప్రతి ఒక్క అభ్యర్థి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అధ్యాపకులు చెప్పే సూచనలు పాటిస్తూ, ప్రణాళికాబద్ధంగా చదివితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమవుతుందన్నారు. సమయ పాలన పాటిస్తూ నిరంతరం సాధన చేస్తూ, తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాన్ని సాధించాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ, సింగరేణి సంయుక్తంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్ స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ ఆపరేషన్స్ బి. రవి, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

